# ప్రేమతో సేవే పరమారాధన : బిషప్ విజయపాల్

**పునీత అంతోని మహోత్సవాల ముగింపులో ఆధ్యాత్మిక సందేశం -భక్తులతో కిటకిటలాడిన ధర్మసాగర్**

**ప్రార్థనలకంటే పరులకు అండగా నిలవడమే గొప్పదన్న బిషప్ -నవదిన ఆరాధనలు, భక్తి కార్యక్రమాలకు ఘన ముగింపు**









**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూన్ 13 (జర్నలిస్ట్ వార్త):** ప్రార్థనల కంటే పరులకు చేసే సేవే దేవునికి అత్యంత ప్రీతికరమని, ప్రేమ, కరుణ, సేవాభావంతో జీవించినప్పుడే క్రైస్తవ ధర్మ సారాంశం నెరవేరుతుందని వరంగల్ బిషప్ దుగ్గిపొడి విజయపాల్ పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ గ్రామంలోని రోమన్ క్యాథలిక్ పునీత అంతోని వారి 49వ వార్షికోత్సవ మహోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఆయన భక్తులకు ఆధ్యాత్మిక సందేశం అందించారు. తొమ్మిది రోజుల పాటు కొనసాగిన నవదిన ప్రార్థనలు, ప్రత్యేక ఆరాధనలు, భక్తి కార్యక్రమాలు శనివారం వైభవంగా ముగిశాయి. విచారణ గురువు ఫాదర్ జోజి బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి క్రైస్తవ భక్తులు తరలివచ్చి పునీత అంతోని వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా బిషప్ విజయపాల్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో విశ్వాసం పేరుతో కేవలం ప్రార్థనలకే పరిమితం కాకుండా, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం, పేదలను ఆదుకోవడం, మానవత్వాన్ని చాటడం ప్రతి క్రైస్తవుడి బాధ్యత అని అన్నారు. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునే చేతులే నిజమైన ప్రార్థనలని, ప్రేమతో నిండిన హృదయమే దేవుని ఆలయమని పేర్కొన్నారు. ఆయన సందేశం భక్తులను ఆలోచింపజేసేలా, సేవా భావాన్ని పెంపొందించేలా సాగింది. ప్రత్యేక ప్రార్థనల అనంతరం సంఘ పెద్దలు, విచారణ గురువులు బిషప్ విజయపాల్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుడి కమిటీ సభ్యులు, సంఘ పెద్దలు, మహిళలు, యువతతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రైస్తవ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పునీత అంతోని జయజయధ్వానాలు, భక్తిగీతాలు, ప్రార్థనలతో ధర్మసాగర్ గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఉత్సవాల ముగింపు సందర్భంగా భక్తుల సందడి, ఆధ్యాత్మిక ఉత్సాహం గ్రామమంతా ప్రత్యేక వాతావరణాన్ని నెలకొల్పాయి.



# విశ్వబ్రాహ్మణుల ఐక్యతే సమాజ అభ్యున్నతికి బాట

**మహిళా కమిషన్ సభ్యురాలు కాసోజు శంకరమ్మకు ఘన సన్మానం**



**తల్లాడ,/ జూన్ 13 (జర్నలిస్ట్ వార్త):** విశ్వబ్రాహ్మణ సమాజ అభివృద్ధికి జాతి బిడ్డలంతా ఐక్యంగా కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ జర్నలిస్టు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టిన కాసోజు శంకరమ్మను సంఘం ప్రతినిధులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ జర్నలిస్టు సంఘం వ్యవస్థాపకుడు తూములూరి సత్యనారాయణ చారి సూచనల మేరకు, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష నరసింహచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాసోజు శంకరమ్మకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సామాజిక అభ్యున్నతి కోసం అందరూ సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ ప్రయోజనాల కోసం ఐక్యతతో ముందుకు సాగితేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. కాసోజు శంకరమ్మ మాట్లాడుతూ మహిళా కమిషన్ సభ్యురాలిగా మహిళల హక్కుల పరిరక్షణ, సాధికారత, సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు గుండోజు శ్రీనివాస్, జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి మండలోజు వరప్రసాద్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు తాళ్ళోజు బ్రహ్మయ్య చారి, నెమలికొండ గోవిందాచారి, దాట్ల కృష్ణమూర్తి, వెంకటాచారి, సంతోష్ కుమార్, సంజయ్ చారి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ఫలాలు పేదవాడి గడప దాటుతున్నాయా?



దేశం అభివృద్ధి చెందుతోందని పాలకులు గొప్పలు చెబుతున్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్నామని, ఆర్థిక వ్యవస్థ బలపడుతోందని, భారీ ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని చెప్పుకుంటున్నారు. నగరాల్లో ఎత్తైన భవనాలు, విశాలమైన రహదారులు, ఆధునిక సౌకర్యాలు కనిపిస్తున్నాయి. కానీ గ్రామాల్లో, బస్తీల్లో, అట్టడుగు వర్గాల జీవితాలను పరిశీలిస్తే అభివృద్ధి అసలు ఎవరి కోసం జరుగుతోందనే ప్రశ్న తలెత్తుతోంది.

రాజకీయ నాయకుడి కొడుకు రాజకీయ నాయకుడవుతున్నాడు. ముఖ్యమంత్రి కొడుకు ముఖ్యమంత్రిగా ఎదుగుతున్నాడు. పెద్ద వ్యాపారవేత్తల వారసులు కోట్ల రూపాయల వ్యాపారాలకు యజమానులవుతున్నారు. భూస్వామి కుటుంబాలు మరింత భూములు కూడబెట్టుకుంటున్నాయి. కానీ పేదవాడి కొడుకు మాత్రం నేటికీ కూలీ పనులకే పరిమితమవుతున్నాడు. అతని కుటుంబం తరతరాలుగా పేదరికపు సంకెళ్లలోనే బంధించబడుతోంది.

స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనభై ఏళ్లు దాటినా పేదవాడి జీవితంలో ఆశించిన స్థాయిలో మార్పు కనిపించడం లేదు. ఎన్నికల సమయంలో ప్రతి పార్టీ పేదల సంక్షేమమే తమ లక్ష్యమని చెబుతోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పథకాలు ప్రవేశపెడుతోంది. అయినప్పటికీ పేదరికం పూర్తిగా తగ్గడం లేదు. కారణం పేదరికానికి మూలమైన నిరుద్యోగం, అసమానతలు, అవకాశాల కొరత వంటి సమస్యలపై సరైన దృష్టి పెట్టకపోవడమే.

నేడు ఒక పేద కుటుంబానికి చెందిన విద్యార్థి ఉన్నత చదువులు చదవాలంటే ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారుతున్నాయి. ఉద్యోగం పొందాలంటే పోటీ ప్రపంచంలో అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోంది. రైతు అప్పుల బాధతో అల్లాడుతున్నాడు. కూలీకి ఏడాది పొడవునా పని దొరకడం లేదు. మధ్యతరగతి కుటుంబాలు పెరుగుతున్న ధరలతో నలిగిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా అందుతున్నాయని చెప్పడం వాస్తవానికి దూరంగానే ఉంటుంది.

సంక్షేమ పథకాలు అవసరమే. కానీ అవి పేదవాడిని శాశ్వతంగా పేదరికం నుంచి బయటకు తీసుకురావాలి. కేవలం నగదు పంపిణీ, ఉచిత పథకాలతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పరిశ్రమల ఏర్పాటు, వ్యవసాయానికి గిట్టుబాటు ధరలు, అందుబాటు వైద్యం వంటి అంశాలపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలి.

దేశ సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా విధానాలు రూపొందించాలి. అభివృద్ధి అంటే కేవలం జీడీపీ పెరగడం కాదు. పేదవాడి ఆదాయం పెరగాలి. అతని పిల్లలు చదువుకోవాలి. అనారోగ్యం వస్తే అప్పుల పాలుకాకుండా వైద్యం అందాలి. సొంత ఇల్లు, స్థిరమైన ఉపాధి, గౌరవప్రదమైన జీవితం ప్రతి పౌరుడికి అందాలి. నేడు దేశానికి అవసరమైంది గణాంకాల అభివృద్ధి కాదు... మనుషుల అభివృద్ధి. భవనాల ఎత్తు కాదు... ప్రజల జీవితాల ఎదుగుదల. పాలకులు ఈ విషయాన్ని గుర్తించినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుంది.

పేదవాడి బతుకు మారితేనే దేశం మారినట్లు.

పేదవాడి ఇంట్లో వెలుగు నిండితేనే అభివృద్ధి సార్థకమైనట్లు.



**సీనియర్ జర్నలిస్ట్ కొట్టే సుధాకర్ (లెనిన్)**
**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఐజేయూ)జిల్లా కార్యవర్గ సభ్యులు**
**సెల్: 9908401581**



# సంకలో హెల్మెట్.. తలపై ప్రమాదం!

**కొనిజర్ల, /జూన్ 12 (జర్నలిస్ట్ వార్త):** ప్రాణాలను కాపాడే హెల్మెట్‌ను కొందరు ద్విచక్ర వాహనదారులు కేవలం జరిమానాల నుంచి తప్పించుకునే సాధనంగా మార్చేస్తున్నారు. తలపై ధరించాల్సిన హెల్మెట్‌ను సంకలో పెట్టుకుని కొనిజర్ల మండల పరిధిలోని జాతీయ రహదారులపై నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. రోడ్డు ప్రమాదాల్లో తలకు తీవ్ర గాయాలు కాకుండా రక్షించేందుకు హెల్మెట్ తప్పనిసరి అయినప్పటికీ, చాలామంది దానిని ధరించకుండా వాహనాలకు వేలాడదీసుకుని లేదా సంకలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. దీంతో ప్రమాదం సంభవించిన సమయంలో హెల్మెట్ ఉన్నా ప్రాణ రక్షణకు ఉపయోగపడని పరిస్థితి నెలకొంటోంది. హెల్మెట్ ప్రాముఖ్యతపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో మార్పు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా యువతలో నిర్లక్ష్య ధోరణి ఎక్కువగా కనిపిస్తోందని పేర్కొంటున్నారు. జాతీయ రహదారిపై వేగంగా ప్రయాణించే వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో హెల్మెట్‌ను తప్పనిసరిగా తలపై ధరించేలా అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. హెల్మెట్ సంకలో ఉంటే ఫైన్ తప్పొచ్చు.. తలపై ఉంటే ప్రాణం దక్కుతుంది అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఉప సర్పంచ్ లకు చెక్‌పవర్ రద్దు ఆలోచన ఉపసంహరించుకోవాలి.

**-ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి.**



**బయ్యారం,/జూన్ 12 (జర్నలిస్ట్ వార్త):** ఉపసర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని జగ్గుతండ ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో వీరస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉపసర్పంచ్‌ల చెక్ పవర్‌ను రద్దు చేయాలని చూస్తున్నదని, వెంటనే ఆ ఆలోచనను విరమించుకోవాలని కోరారు. లేనిపక్షంలో మండల ఉపసర్పంచ్ ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చెపడతామని పేర్కొన్నారు. అదేవిధంగా ఉపసర్పంచ్ ల సంఘం ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తామని, ప్రభుత్వం దిగివచ్చే వరకూ ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

## సూపర్నెంట్ కలిసినహ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ టీం




**ఖమ్మం/ జూన్ 13( జర్నలిస్ట్ వార్త)** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గవర్నమెంట్ హాస్పిటల్ సూపర్డెంట్ కలిసిన మర్యాదపూర్వకంగా కలిసి వారితో ప్రభుత్వం సేవలను ప్రజల్లోకి తీసుకువెళ్ల వెళుతున్నామని అదేవిధంగా ప్రజల్లోనే చట్టాలపై అవగాహన కల్పిస్తూ విద్య వైద్యంపై అవగాహన కల్పిస్తున్నామని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ వారు చెప్పటం జరిగింది ఈ కార్యక్రమంలోహ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ బొడ్డపాటి దాసు డాక్టర్ ఎనుముల రుక్మిణి డాక్టర్ తేల్లూరి చిన్న ఏసు పర్వత రాజేశ్వరి , తదితరులు ఉన్నారు

## ఏజెన్సీ గ్రామాల్లో యూరియా యాప్ వినియోగంపై అవగాహన.


**-జిల్లా వ్యవసాయ అధికారి విజయ చంద్ర.**





**బయ్యారం/,జూన్ 13.(జర్నలిస్ట్ వార్త)**
మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.విజయ చంద్ర,మండల వ్యవసాయ అధికారి కే.రాజుతో కలిసి బయ్యారం మండలంలోని కొత్తపేట నుండి మిర్యాలపెంట వరకు ఏజెన్సీ గ్రామాలను సందర్శించి,రైతులతో ప్రత్యక్షంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో యూరియా యాప్ పనితీరును పరిశీలించి,రైతులకు యాప్ ద్వారా యూరియా బుకింగ్ విధానం,దాని ప్రయోజనాలు,పారదర్శకత గురించి రైతులకు వివరించారు.అల్లిగూడెం,పందిపంపుల గ్రామాలలో రైతులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి యూరియా యాప్ వినియోగంపై విస్తృత అవగాహన కల్పించారు.యాప్ ద్వారా రైతులు సులభంగా యూరియా బుకింగ్ చేసుకోవచ్చని,ఎరువుల పంపిణీ మరింత సమర్థవంతంగా జరుగుతుందని వివరించారు.అనంతరం అల్లిగూడెం గ్రామ సర్పంచ్ చింత ప్రసాద్ తో సమావేశమై గ్రామంలోని వ్యవసాయ పరిస్థితులను తెలుసుకున్నారు.పంటల వైవిధ్యీకరణలో భాగంగా రానున్న వానాకాలంలో మొక్కజొన్న సాగు నుండి ఆయిల్ పామ్ సాగుకు మారేందుకు ముందుకు వచ్చిన రైతులు అవిరె నారాయణ, మురళీకృష్ణ తదితరులను జిల్లా వ్యవసాయ అధికారి ప్రత్యేకంగా అభినందించారు.ఇతర రైతులు కూడా అధిక ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి పంట అవశేషాల దహనం వల్ల నేల సారం తగ్గిపోవడం, పర్యావరణ కాలుష్యం పెరగడం, భూసార జీవులు నశించడం వంటి దుష్పరిణామాలను రైతులకు వివరించారు.అదేవిధంగా పంటల వైవిధ్యీకరణ అవసరాన్ని నొక్కి చెబుతూ,నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,లైసెన్స్ పొందిన విత్తన విక్రయ కేంద్రాల నుంచే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు.యూరియా ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించి, సమీకృత పోషక నిర్వహణ పద్ధతులను అవలంబించాలని, నేల పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించడం ద్వారా ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు,ప్రజాప్రతినిధులు,రైతులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు






**గీసుగొండ/జూన్ 13(జర్నలిస్ట్ వార్త);**
అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం సుధాకర్ వైన్స్ ఎదురుగా ఉన్న రోడ్ క్రాస్ డివైడర్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎస్.ఆర్. నగర్ (ఏనుమాముల)కు చెందిన లక్కర్స్ రవీందర్ (48), రంగశాయిపేటకు చెందిన మోదం నవీన్ అనే వ్యక్తితో కలిసి శుక్రవారం మధ్యాహ్నం ధర్మారంలో పని ముగించుకుని టీవీఎస్ ఎక్స్ఎల్ వాహనంపై తిరిగి వస్తున్నారు. వరంగల్ వైపు రావడానికి డివైడర్ వద్ద ఇండికేటర్ వేసి రోడ్డు దాటుతుండగా, నర్సంపేట నుండి హన్మకొండ వైపు వెళ్తున్న నర్సంపేట డిపోకు చెందిన టీజీఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవీందర్‌కు తల, ఛాతికి తీవ్ర గాయాలవ్వగా, నవీన్ కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా వారిని చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అనంతరం నవీన్‌ను మెరుగైన చికిత్స కోసం గార్డియన్ ఆసుపత్రికి తరలించారు. కాగా, ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ పత్తి రమేష్‌పై రవీందర్ కుమారుడు అఖిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉపాధి కూలీల దాహం తీర్చిన హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్

### 150 మంది కూలీలకు మజ్జిగ పంపిణీ



**కల్లూరు/ జూన్ 12 (జర్నలిస్ట్ వార్త):**
మండుతున్న ఎండల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు చల్లని ఉపశమనం కల్పించేందుకు హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కల్లూరు మండలం ఓబలరావు బంజర్ గ్రామంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 150 మంది ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ అందజేశారు.ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాలోత్ కళ్యాణి సీతారాములు మాట్లాడుతూ, ఎండల తీవ్రత మధ్య కూలీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మానవతా దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సమాజంలో వృద్ధులు, దివ్యాంగులు, అనాథలు, నిరుపేదల సంక్షేమానికి సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు.
గతంలో కూడా గ్రామంలోని పెద్దలను సన్మానించడం, అన్నదాన కార్యక్రమాలు, వస్త్ర పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించిన మాలోత్ కళ్యాణి సీతారాముల సేవలను గ్రామస్తులు ప్రశంసించారు. వారి సేవాభావాన్ని కొనియాడుతూ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు, గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాలోత్ రాధా నరసింహారావు, గ్రామ కార్యదర్శి, గ్రామ పెద్దలు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డపాటి దాసు, డాక్టర్ ఎనుముల రుక్మిణి, డాక్టర్ తేళ్లూరి చిన్న ఏసు, పర్వత రాజేశ్వరి, తేజావత్ పార్వతి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని గ్రామ ప్రజల సహకారంతో విజయవంతంగా నిర్వహించారు.

## ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛ పాఠశాల కార్యక్రమం

**భీమదేవరపల్లి/జూన్13 (జర్నలిస్ట్ వార్త):**
భీమదేవరపల్లి ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్ మాచర్ల కుమారస్వామి ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచడం, విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం భీమదేవరపల్లిలో ఉపాధి హామీ కూలీలకు సర్పంచ్ మాచర్ల కుమారస్వామి మజ్జిగ పంపిణీ చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శనిగరం ఐలయ్య, వార్డు సభ్యులు ప్రేమలత, సంధ్య, విజయ, సదానందం, శ్రీనివాస్ రెడ్డి, పోలు అశోక్, వెంకటేశ్వర్లు, శ్యామ్, గ్రామ పెద్దలు చేరాల తిరుపతి, శివసారపు రవీందర్, శ్రీకాంత్, వరుణాకర్, సతీష్, అజయ్, సంపత్, కరుణాకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.





## గట్టు ముసలమ్మ ఆలయంలో దొంగల అలజడి.


**-రెండు హుండీల ధ్వంసం..!**



**బయ్యారం/,జూన్ 13.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలోని రామచంద్రాపురం ప్రధాన రహదారిపై కొలవై ఉన్న గట్టు ముసలమ్మ దేవాలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోని గేట్ల తాళాలను పగలగొట్టి గర్భగుడిలో హుండీలలో సొత్తు అపహరించారు. శనివారం ఉదయం అటుగా వెళ్లిన ఉపాధి కూలీలు ఆలయంలో దర్శనం కోసం వెళ్లగా ఆలయంలో దొంగతనం జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు, ఆకతాయిలు హుండీలను పగలగొట్టి వాటిలోని నగదును కాజేసేందుకు ఇలాంటి పనులు చేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. హుండీలో నగదు ఎంత మేర సొమ్ము అపహారణకు గురైందో ఆలయ కమిటీ ద్వారా సమాచారం తెలియాల్సి ఉంది.ఆలయ ప్రాంగణంలో సిసి కెమెరాలు పనిచెయ్యడం లేదు.ఆలయంలో దొంగతనం జరిగిన విషయం తెలుసుకున్న సిఐ రవీందర్,ఎస్ఐ ప్రశాంత్ బాబు సంఘటన ప్రాంతానికి దొంగతనం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు.ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఆత్మహత్య పరిష్కారం కాదు

# జీవన పోరాటంలో ధైర్యమే అసలైన ఆయుధం



వసతులు పెరిగాయి. కానీ, అదే వేగంతో మనిషిలో ఒత్తిడి, సహనం కోల్పోవడం కూడా పెరుగుతున్నాయి. చిన్న సమస్య ఎదురైతే చాలు, క్షణికావేశంలో అత్యంత విలువైన జీవితాన్ని ముగించేసేందుకు కొందరు వెనకాడటం లేదు. పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని విద్యార్థులు, అప్పుల బాధ తాళలేక రైతులు, వ్యాపారంలో నష్టాలు వచ్చాయని వ్యాపారస్తులు, కుటుంబ కలహాలతో సామాన్యులు. ఇలా రకరకాల కారణాలతో ఆత్మహత్య ల వైపు అడుగులు వేస్తున్నారు. కానీ, ఒక్కటి మాత్రం నిశ్చయం ఆత్మహత్య అనేది ఏ సమస్యకూ పరిష్కారం కాదు, అది మరో పెద్ద సమస్యకు ఆరంభం మాత్రమే.

**జీవితం అంటేనే సవాళ్ల సమాహారం.**

సుఖదుఃఖాలు, గెలుపోటములు సహజం. రాత్రి తర్వాత పగలు, చీకటి తర్వాత వెలుగు రావడం ఎంత సత్యమో. కష్టం తర్వాత సుఖం రావడం కూడా అంతే సహజం. సమస్యలు వచ్చినప్పుడు వాటిని ఎదుర్కొనే గుండె నిబ్బరాన్ని అలవర్చుకోవాలే తప్ప, పారిపోవడం పిరికితనం అవుతుంది. ఒక్క క్షణం ఆలోచిస్తే, ఆత్మహత్య చేసుకునే వ్యక్తి తన బాధ నుంచి విముక్తి పొందవచ్చని భ్రమపడతాడు. కానీ, తనను నమ్ముకున్న కుటుంబానికి, కన్నవారికి తీరని శోకాన్ని, అంతులేని మానసిక క్షోభను మిగిల్చి వెళుతున్నాననే నిజాన్ని విస్మరిస్తున్నాడు. అనాథలవుతున్న పిల్లలు, దిక్కుతోచని స్థితిలో పడిపోయే తల్లిదండ్రుల క్రందనలు ఆత్మహత్యల వెనుక ఉన్న చేదు నిజాలు.

**సమస్యలు తాత్కాలికం...
కానీ జీవితం శాశ్వతం.**

పోరాడి సాధించడంలోనే మానవ జన్మ సార్థకత ఉంది. ప్రస్తుత విద్యా, సామాజిక వ్యవస్థల్లో కూడా మార్పు రావలసిన అవసరం ఎంతైనా ఉంది. గెలుపును మాత్రమే సంబరంగా జరుపుకునే మనం, ఓటమిని కూడా అంతే సహజంగా స్వీకరించే మనస్తత్వాన్ని పిల్లలకు నేర్పాలి. మార్కులే జీవితం కాదని, ర్యాంకులు రాకపోతే ప్రపంచం ముగిసిపోదని యువతకు అర్థమయ్యేలా చెప్పాలి, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి భరోసా ఇచ్చేలా ప్రభుత్వాలు, సామాజిక సంస్థలు అండగా నిలవాలి.
మానసిక ఒత్తిడి తీవ్రంగా ఉన్నప్పుడు ఎవరైనా సరే ఒంటరిగా ఉండిపోకూడదు. స్నేహితులతో, కుటుంబ సభ్యులతో మనసు విప్పి మాట్లాడాలి. అవసరమైతే మానసిక నిపుణుల (కౌన్సిలర్స్) సహాయం తీసుకోవడం ఏమాత్రం తప్పు కాదు. ప్రతి ఒక్కరిలోనూ ఒక ప్రత్యేకమైన శక్తి ఉంటుంది. దాన్ని గుర్తించి, ఆత్మవిశ్వాసంతో అడుగు ముందుకు వేస్తే ఎంతటి సంక్షోభాన్ని అయినా దాటవచ్చు. తుఫాను ఎంత ఉధృతంగా వచ్చినా, అది ఎల్లకాలం ఉండదు. మబ్బులు విడిపోయాక సూర్యుడు మళ్లీ ఉదయిస్తాడు. అలాగే మన జీవితంలో కష్టాలు కూడా తాత్కాలికమే. పోరాడి గెలవాలే తప్ప, చేతులారా ప్రాణాలు తీసుకోవడం విజ్ఞత అనిపించుకోదు. ప్రాణం చాలా విలువైంది, దాన్ని గౌరవిద్దాం. ధైర్యంగా జీవిద్దాం, ఇతరులకు ఆదర్శంగా నిలుద్దాం.



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్

## మన బడి మన బాధ్యత కార్యక్రమంలో పాఠశాలల పరిశుభ్రత





**భీమదేవరపల్లి/జూన్13 (జర్నలిస్ట్ వార్త):** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపు మేరకు చేపట్టిన “మన బడి మన బాధ్యత” కార్యక్రమంలో భాగంగా భీమదేవరపల్లి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలు, తరగతి గదులను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు. వంగర, గట్లనర్సింగపూర్, కొత్తకొండ, రసూలపల్లి, భీమదేవరపల్లి, కొత్తపల్లి, మాణిక్యపూర్, రంగయ్యపల్లి తదితర గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించగా, మిగిలిన గ్రామాల్లో కూడా త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. “మన బడి మన బాధ్యత” ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

